# ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు: ముఖ్యమంత్రి చంద్రబాబు

విజయవాడ, జనవరి 11 : 'జన్మభూమి–మాఊరు' కార్యక్రమానికి ప్రజల నుంచి వచ్చిన స్పందన తనకు ఎంతగానో సంతృప్తినిచ్చిందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. జన్మభూమి–మాఊరు కార్యక్రమం విజయవంతం చేసిన రాష్ట్ర ప్రజలకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు చెబుతున్నట్టు తెలిపారు. గురువారం రాత్రి విజయవాడ క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి ఐదో విడత జన్మభూమి–మాఊరు కార్యక్రమంపై ఉన్నతాధికారులతో సమీక్షించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాలలో ప్రజల కోసం, ప్రజల భాగస్వామ్యంతో ఇంత పెద్ద కార్యక్రమాన్ని నిర్వహించడం దేశంలో మరెక్కడా జరగలేదని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ఈ మహత్కార్యంలో భాగమైన ప్రతి ఒక్కరినీ అభినందిస్తున్నట్టు తెలిపారు. ఈసారి 'జన్మభూమి–మాఊరు' కార్యక్రమం ద్వారా పరిపాలన యంత్రాంగంపై ప్రజలలో సానుకూల ధోరణి రావడం విశేషమని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. పది రోజులు నిర్వహించిన ఈ కార్యక్రమం ప్రజానీకంలో ప్రభుత్వం పట్ల విశ్వాసాన్ని మరింత ప్రోదిచేసిందని, ప్రభుత్వ బాధ్యతను మరింత పెంచిందని అన్నారు. పింఛన్లు ఎన్ని లక్షలు ఇచ్చామన్నది ముఖ్యం కాదని, ఎంతమంది అర్హులకు అందిస్తున్నామనేదే అత్యంత ముఖ్యమైన విషయమని అన్నారు. అర్హత ఉన్న ఏ ఒక్కరూ పింఛను అందుకోవడం లేదనే అసంతృప్తి చెందకూడదన్నారు. రేషన్ కార్డులే కొలమానంగా కాకుండా ఒకే ఇంట్లో ఇద్దరు, ముగ్గురు అర్హులు ఉన్నా వారికి పింఛన్ సహా ఇతర ప్రభుత్వ ప్రయోజనాలు కల్పించే విధంగా కార్యాచరణ చేపట్టాలని అధికారులకు సూచించారు. కేవలం ప్రభుత్వ ప్రయోజనాలు అందుకోవడం కోసం ఉన్నతమైన మన కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నం కాకుండా చూడాల్సిన సామాజిక బాధ్యత మనందరిపై ఉన్నదని ఆయన అన్నారు. గర్భిణిలకు, చిన్నారులకు పౌష్టికాహారం సక్రమంగా అందించగలిగితే ప్రజలలో వచ్చే సంతృప్తి వేరుగా ఉంటుందని, ఈ అంశంలో స్త్రీశిశు సంక్షేమ శాఖ రానున్న కలెక్టర్ల సదస్సులో తగిన కార్య ప్రణాళికతో రావాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. జన్మభూమి–మాఊరు స్ఫూర్తిగా క్షేత్రస్థాయిలో పథకాలన్నీ మరింత సక్రమంగా, సమర్ధంగా, వేగంగా ప్రజలకు అందేలా చూడాలని, కలెక్టర్ల సదస్సు అందుకు వేదిక కావాలని చెప్పారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, సర్పంచ్‌ల స్థాయిలో ఐటీ అంశాలపై త్వరలో పెద్దఎత్తున శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించాలని ముఖ్యమంత్రి ఆ శాఖ అధికారులకు సూచించారు. ప్రభుత్వం ఇప్పటికే ఐటీ, ఐవోటీ అంశాలపై పెద్దఎత్తున దృష్టి పెట్టిందని, దీనిని క్షేత్రస్థాయిలో మరింత ఉధృతంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని అన్నారు. సమావేశంలో పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.